సాక్షి
ఆదిలాబాద్
సోమవారం : 17 : జూలై : 2023

ఇప్పడైనా సరిచేస్తారా..?



గతంలో ఓటరు నమోదులో తప్పులు దొర్లాయి. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో తిరగకుండానే వివరాలు నమోదు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో తాజాగా చేపట్టిన కార్యక్రమంలోనూ అదే తీరు కనిపిస్తుండడం గమనార్హం. 8లో▸

లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్‌: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రవికాంత్, తిరుపతిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జ్ఞానేశ్వర్, కోశాధికారిగా ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా వాహిద్‌ఖాన్, సలహాదారుడిగా గోవర్దన్, సభ్యులుగా సుభాష్, సురేశ్, సోమేశ్ ఎన్నికయ్యారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు



స్విమ్మింగ్ చేస్తున్న క్రీడాకారులు

ఆదిలాబాద్‌టౌన్‌: తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్‌లో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. గ్రూప్ వన్, టూ, త్రీ విభాగాల్లో బాల, బాలికలు 60 మంది పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెటా అధ్యక్షుడు కోరెడ్డి పార్థసారథి, స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మహేంద్రజిత్ కుమార్, కోచ్‌లు కృష్ణ, చంద్రకాంత్, రాకేశ్, శ్రీనివాస్‌గౌడ్, గజు గౌడ్ పాల్గొన్నారు.

'పాత పెన్షన్' పునరుద్ధరించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్‌: పాత పెన్షన్ విధానం సాధించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 'జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్' ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు, పోరాటాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సదస్సుకు జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామేశ్వర్, టీఎస్ పీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రియాజ్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, కోశాధికారి కిష్టన్న, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, విలాస్, గౌస్ మొహియుద్దీన్, శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం'



మాట్లాడుతున్న ఎస్. విలాస్

ఎదులాపురం: కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఐదో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలు చేస్తుందని విమర్శించారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సంజయ్, కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా రమేశ్ ఎన్నికైనట్లు వెల్లడించారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈవో ప్రణీత (ఫైల్)

మరోసారి తొలిమెట్టు

- గతేడాది సక్సెస్‌తో కొనసాగింపు
- విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం
- ఉన్నత తరగతులకు 'లిప్'
- ఆగస్టు నుంచి అమలుకు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్‌: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడంతో గతేడాది పాఠశాల విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఆయా ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేసింది. దీంతో విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయి. ఈ విద్యా సంవత్సరం కూడా కొనసాగించేందుకు విద్యాశాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్లకు శిక్షణ నిర్వహించారు. అలాగే ఉన్నత తరగతుల విద్యార్థుల్లోనూ కనీస సామర్థ్యాలు, భాష పరిజ్ఞానం కోసం లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామ్ (లిప్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆగస్టు నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు విద్యా శాఖాధికారులు చెబుతున్నారు.

తొలిమెట్టు కొనసాగింపు..

జిల్లాలో డీఈవో పరిధిలో 465 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1285 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లాలోని సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల కనీస సామర్థ్యాలు దయనీయంగా ఉండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాయి. విద్యా పరంగా జాతీయ స్థాయిలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఆదిలాబాద్ ఉండంతో తొలిమెట్టు, ఎఫ్‌ఎల్‌ఎం కార్యక్రమాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో జిల్లా విద్యా శాఖాధికారులతో హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఈ విద్యా సంవత్సరం కూడా అమలు చేయాలని నిర్ణయించారు. విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి వాకటి కరుణ, డైరెక్టర్ దేవసేన ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ..

తొలిమెట్టు కార్యక్రమ నిర్వహణపై ఈనెల 19 నుంచి ఆగస్టు 1వరకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్లు ఈనెల 13 నుంచి 15 వరకు శిక్షణ పొందారు. తెలుగులో కంటి రవికుమార్, స్వామి, ఆంగ్లంలో బి.గంగయ్య, బలిరాం, గణితంలో సతీశ్‌కుమార్, ఆరె శ్రీనివాస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరు జిల్లా స్థాయిలో ఈనెల 19 నుంచి 21 వరకు జిల్లాలోని ఆయా మండలాల నుంచి ఆరుగురు చొప్పున 102 మంది టీచర్లకు జిల్లా కేంద్రంలోని వివేకానంద బీఎడ్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లు మండల స్థాయిలో 24, 25 తేదీల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయులకు, 26, 27 తేదీల్లో గణితం బోధించే ఉపాధ్యాయులకు, ఈనెల 30, ఆగస్టు 1న ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. పాఠశాలలు మూతబడకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు.

'లిప్'కు శ్రీకారం..

ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు సక్సెస్ కావడంతో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 'ఉన్నతి అభ్యసన' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామ్ (లిప్)కు శ్రీకారం చుట్టనున్నారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. విద్యార్థులకు మాతృభాషతో పాటు ద్వితీయ, తృతీయ భాషలో స్పష్టంగా మాట్లాడటం, తప్పులు లేకుండా రాయడం, అర్థం చేసుకోవడం, ఆలోచించడం, వ్యక్తపర్చడం, స్వీయ సామర్థ్యాల పెంపు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో ప్రతిభ చాటేలా కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. జిల్లాలోని 105 ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ తరగతులకు ఆటంకం కలగకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఆరు నుంచి 9 తరగతులకు 'లిప్'



తొలిమెట్టు సక్సెస్ కావడంతో 6 నుంచి 9 తరగతులు చదివే విద్యార్థులకు లిప్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యా శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఆగస్టు నుంచి అమలు చేసే అవకాశం ఉంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్నాను. విషయ నిపుణులు హాజరయ్యారు. తొలిమెట్టు మాదిరిగానే ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు విద్యా శాఖ చర్యలు చేపడుతుంది. విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు, భాష అభివృద్ధి, ఆయా సబ్జెక్టుల్లో పట్టు సాధించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుంది.

– అశోక్, లిప్ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్

ఈ ఏడాది కూడా 'తొలిమెట్టు'



జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో గతేడాది నిర్వహించిన తొలిమెట్టు కార్యక్రమం పకడ్బందీగా అమలు చేశాం. దీంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. చతుర్విద ప్రక్రియలతో పాటు ధారళంగా చదవడం, పదాలు రాయడంలో మెరుగుపడ్డారు. దీంతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఈ విద్యా సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయిలో ఈనెల 19 నుంచి 21 వరకు, మండల స్థాయిలో 24 నుంచి ఆగస్టు 1 వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. విద్యాశాఖ నియమించిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

– కంటి నర్సయ్య, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్

మళ్లీ నిరాశే..!

తాంసి మండలంలో రెండో విడత గొర్రెల కోసం 203 మంది గొల్ల, కుర్మలు డీడీలు చెల్లించి నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈదుల్లా సావర్గాం గ్రామంలోని ఆరుగురికి మాత్రమే తాజాగా గొర్రెలను పంపిణీ చేశారు. మిగతా 197 మందికి ఎప్పుడు పంపిణీ చేస్తారనేది స్పష్టత లేదు. దీంతో వారిలో నిరాశ నెలకొంది. ఈ ఒక్క మండలమే కాదు.. జిల్లావ్యాప్తంగా డీడీలు చెల్లించిన చాలా మంది పరిస్థితి ఇది.



జిల్లాలో..

గొర్రెల పెంపకం సహకార సొసైటీలు : 133
ఆయా సొసైటీల్లోని సభ్యులు : 8,660
మొదటి విడతలో యూనిట్లు పొందిన వారు : 5,022
మలివిడతలో పంపిణీ చేయాల్సిన యూనిట్లు : 3,597
మలివిడత కోసం డీడీలు చెల్లించినవారు : 2,303
పంపిణీకి ఎంపిక చేసిన లబ్ధిదారులు: 112

- మండలానికి ఆరు యూనిట్లే..
- జిల్లాలో 112 మందికి మాత్రమే లబ్ధి
- ఆందోళనలో గొల్ల, కుర్మలు
- మలివిడత గొర్రెల పంపిణీ ప్రక్రియ తీరిది

కైలాస్‌నగర్‌: మలివిడత గొర్రెల పంపిణీ కోసం నాలుగేళ్లుగా కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తున్న జిల్లాలోని గొల్ల, కుర్మలకు మళ్లీ నిరాశే ఎదురవుతోంది. వేలల్లో దరఖాస్తులు అందగా మండలానికి ఆరు యూనిట్లు మాత్రమే పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో తమ పరిస్థితేంటని మిగతా వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొర్రెలు అందుతాయనే ఆశతో అప్పు చేసి మరీ డీడీలు చెల్లిస్తే ప్రభుత్వం పరిమిత సంఖ్యలో పంపిణీ చేస్తుండటంపై తీవ్రంగా మండిపడుతున్నారు.

మండలానికి ఆరు యూనిట్లు మాత్రమే..

కులవృత్తిపై ఆధారపడి జీవించే గొల్ల, కుర్మలకు చేయూతనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో లబ్ధిదారునికి 20 గొర్రెలు, ఒక పొట్టేలుతో కూడిన యూనిట్‌ను అందించాలని నిర్ణయించింది. తొలుత యూనిట్ ధర రూ.1.25లక్షలు ఉండగా దాన్ని ఇటీవల రూ.1.75లక్షలకు పెంచింది. గొర్రెల కోసం రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 3,597 మంది గొల్ల, కుర్మలు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,303 మంది నాలుగేళ్ల క్రితం 25శాతం లబ్ధిదారు వాటాగా రూ.43,750 చొప్పున ప్రభుత్వానికి డీడీలు చెల్లించి వాటి కోసం ఎదురుచూస్తున్నారు. అయితే రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా అర్హులందరికీ గొర్రెలను అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం కేవలం జిల్లాకు 112 యూనిట్లకు సంబంధించిన డబ్బులను మాత్రమే విడుదల చేసింది. దీంతో పశు సంవర్ధకశాఖ అధికారులు మండలానికి ఆరు యూనిట్ల చొప్పున వాటిని అందజేయాలని నిర్ణయించారు. ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఈ నిర్ణయంపై గొల్ల, కుర్మల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. తమ పరిస్థితేంటని సర్కారు తీరును ప్రశ్నిస్తున్నారు.

పలుకుబడి ఉంటేనే..

ఇప్పటి వరకు తాంసి, తలమడుగు, ఉట్నూర్, ఇంద్రవెల్లి, బోథ్ మండలాల్లో ఒక్కో మండలానికి ఆరు యూనిట్ల చొప్పున 48 గొర్రెల యూనిట్లను గ్రౌండింగ్ చేసినట్లుగా పశు సంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. వాటిని కర్నాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి తెప్పించినట్లుగా పేర్కొంటున్నారు. జిల్లాకు అవసరమైన గొర్రెలను బీదర్‌తో పాటు మహారాష్ట్రలోని అకోల, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి కొనుగోలు చేసేలా ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సారి మండల పశు వైద్యాధికారుల ప్రమేయం లేకుండా ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి పర్యవేక్షణలో మండల కమిటీ అధికారులు గొర్రెలను కొనుగోలు చేసి జిల్లాకు తీసుకువస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా మండలానికి ఆరు యూనిట్లే కేటాయించడంతో వాటిని పొందేందుకు తీవ్ర పోటీ నెలకొంది. వీటి కోసం సైతం దరఖాస్తుదారులు పైరవీలకు తెరలేపారు. ఈక్రమంలో రాజకీయ పలుకుబడి కలిగిన వారికే ప్రాధాన్యత దక్కుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. 2,303 మంది డీడీలు చెల్లించగా కేవలం 112 మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేస్తుండటంతో మిగతా 2,191 పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు



జిల్లాలో మలి విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం 112 యూనిట్లకు మాత్రమే నిధులను విడుదల చేసింది. డీడీలు చెల్లించిన వారి సంఖ్య రెండు వేలకు పైగా ఉంది. కానీ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో మండలానికి ఆరు యూనిట్ల చొప్పున అందించాలని నిర్ణయించాం. ఆ దిశగా చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు 48 యూనిట్లను గ్రౌండింగ్ చేశాం. ఈ నెలాఖరు వరకు మిగతా వాటిని పూర్తి చేస్తాం. డీడీలు చెల్లించిన మిగతా వారి పరిస్థితిపై ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– కిషన్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

డీడీలు చెల్లించిన వారందరికీ అందించాలి



డీడీలు చెల్లించి నాలుగేళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్నాం. గొర్రెలను అందజేస్తామని ప్రభుత్వం గత నెలలో ప్రకటించడంతో సంతోషించాం. తీరా మండలానికి ఆరు యూనిట్లు మాత్రమే పరిమితం చేయడం సరికాదు. డీడీలు చెల్లించిన వారందరికీ పంపిణీ చేయాలి.

– సుధాకర్ యాదవ్, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు, తాంసి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



నెత్తిన బోనంతో ఎంపీ సోయం బాపూరావు, తదితరులు

- ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్‌: తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక అని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాలలో అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సామూహిక బోనాల ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, పోతురాజుల నృత్యాల నడుమ ధర్మశాల నుంచి పెద్ద పోచమ్మ ఆలయం వరకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందజేయాలన్నారు. కులస్తులు సంఘ భవనానికి నిధులు కేటాయించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. రూ.5 లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు లాలా మున్నా, తదితరులున్నారు.

బోథ్ డివిజన్ కాకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం

- డివిజన్ ఉద్యమ కమిటీ స్పష్టం
- నేటి నుంచి దీక్షలు

బోథ్‌: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేయకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని బోథ్ డివిజన్ సాధన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని షాదీఖానాలో ఆయా గ్రామాల ప్రజలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అన్ని అర్హతలున్నా బోథ్‌ను ఎందుకు డివిజన్‌గా ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎదురు చూశామని, ఇక ఓపిక పట్టలేమన్నారు. ఒకప్పుడు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, ఉట్నూర్‌తో సమానంగా తాలుకా కేంద్రంగా బోథ్ ఉండేదని, ప్రస్తుతం ఆ పట్టణాలు జిల్లా కేంద్రాలుగా మారాయన్నారు. బోథ్ మాత్రం నియోజకవర్గ కేంద్రంగానే ఉందని, కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయన్నారు. అనంతరం ఉద్యమ కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి దీక్షలు చేయాలని నిర్ణయించారు.



సమావేశమైన ఆయా గ్రామల ప్రజలు

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, ఎంపీపీలు డివిజన్ ఏర్పాటుకు సహకరించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మృతదేహం వెంటే మృత్యు ఒడికి..

లక్సెట్టిపేట: కడవరకూ తోడుంటానని పెళ్లిలో చేసిన ప్రమాణాన్ని దేవుడు నిజం చేయాలనుకున్నాడో ఏమో.. పిల్లలు చిన్నవారన్న దయ కూడా చూపలేదు. భార్య చనిపోయిందని పుట్టెడు దుఃఖంలో ఆమె మృతదేహం వెంటే స్వగ్రామానికి బయల్దేరాడు భర్త. తెల్లవారితే పిల్లలకు అమ్మ ఏదంటే ఏమని సమాధానం చెప్పాలని ఉబికివస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ.. తనలోని బాధ పిల్లలకు కనిపించకూడదన్న ఆలోచనలో ఉన్నాడు. ఇంతలోనే మృత్యువు వెంటాడింది. భార్య చనిపోయిన రెండు గంటల వ్యవధిలోనే లారీ రూపంలో అతడిని కబళించింది. ఈ విషాద సంఘటన లక్సెట్టిపేట మండలంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రుల మరణంతో పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ ఘటనతో మండలంలోని ఎల్లారం గ్రామంలో విషాదం అలుముకుంది.

- క్షణికావేశంలో పురుగుల మందు తాగిన భార్య
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- మృతదేహాన్ని తీసుకెళ్తుండగా భర్తను ఢీకొట్టిన లారీ
- రెండు గంటల వ్యవధిలో దంపతుల మృత్యువాత
- అనాథలైన ఇద్దరు పిల్లలు..



అంత్యక్రియల్లో పాల్గొన్న మృతుల పిల్లలు, వారి కుటుంబసభ్యులు, బంధువులు

చిచ్చుపెట్టిన పొరుగింటి గొడవ..

డ్రైవర్‌గా పనిచేసే భర్త, బంగారం లాంటి ఇద్దరు పిల్లలతో హాయిగా సాగిపోతున్న ఆమె జీవితంలో పొరుగింటి వారితో జరిగిన గొడవ ఆ కుటుంబంలో చిచ్చు పెట్టింది. చివరకు దంపతులిద్దరి మరణానికి కారణమైంది. లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన శరణ్య(28) గృహిణి. ఆమె భర్త మల్లికార్జున్ (33) ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఓంకార్, ఇవాంక సంతానం. సాఫీగా సాగుతున్న వీరి కుటుంబంలో ఒక్కసారిగా పెను విషాదం నెలకొంది. కొద్ది రోజుల క్రితం ఇంటి పక్కన ఉండే రజినితో శరణ్యకు గొడవ జరిగింది. ఇరుగుపొరుగు వారు వచ్చి ఇద్దరికీ నచ్చజెప్పారు. ఇంతలో మరో మహిళ రాణి గొడవలో జోక్యం చేసుకుంది. రజినిని రెచ్చగొట్టి స్థానిక పోలీస్ స్టేషన్‌లో శరణ్యపై ఫిర్యాదు చేయించింది.

మనస్తాపంతో పురుగుల మందు తాగి..

ఈ విషయం తెలిసిన శరణ్య మనస్తాపం చెందింది. చేయని తప్పుకు తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని మదన పడింది. క్షణికావేశంలో ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శరణ్య శనివారం రాత్రి 11 గంటలకు మృతిచెందింది. కోలుకుని ఇంటికి వస్తుందనుకున్న భార్య కానరాని లోకాలకు వెళ్లడంతో మల్లికార్జున్ కన్నీటిపర్యంతమయ్యాడు. అనంతరం తేరుకుని మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు బంధువు సాయంతో అంబులెన్స్ ఏర్పాటు చేశాడు.

అంబులెన్స్ వెనకాలే.. ద్విచక్రవాహనంపై..

అమ్మ త్వరలోనే ఇంటికి వస్తుందని రాత్రి పడుకునే ముందే పిల్లలకు చెప్పాడు మల్లికార్జున్. ఇంతలో శరణ్య మరణించడంతో తెల్లవారి పిల్లలకు ఏం చెప్పాలని దుఃఖాన్ని దిగమింగుతూ తన ద్విచక్రవాహనంపై బంధువుతో కలిసి అంబులెన్స్ వెనకాలే గ్రామానికి బయల్దేరాడు. పిల్లలు రేపటి నుంచి ఎవరిని అమ్మ అని పిలుస్తారని కన్నీరు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో లక్సెట్టిపేటలోని ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకున్నారు. మూత్ర విసర్జన కోసం అక్కడ ఆగారు. ద్విచక్రవాహనం రోడ్డు పక్కన నిలిపారు. మల్లికార్జున్ రోడ్డు దాటుతుండగా రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపునకు వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న బంధువు వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.

రెండు గంటల వ్యవధిలో ఇద్దరు మృతి..

రెండు గంటల వ్యవధిలో భార్య శరణ్య, భర్త మల్లికార్జున్ మృత్యువాత పడడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. తల్లి మరణంతో పిల్లల గురించి ఆలోచిస్తూ వెళ్లిన తాను కూడా పిల్లలను చూడకుండానే దుర్మరణం చెందడంతో బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇద్దరికీ లక్సెట్టిపేట ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను స్వగ్రామానికి తీసుకెళ్లారు. అమ్మా, నాన్న ఇద్దరినీ విగత జీవులుగా చూసిన పిల్లలు బోరున విలపించడం అందరినీ కలచివేసింది. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి వెల్లడించారు.

క్లుప్తంగా

దాడిచేసిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం ఖానాపూర్‌కు చెందిన విఖార్ అహ్మద్‌పై ఆయన బావమరుదులు మజర్, పర్వేజ్, జుబేర్‌లు దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఊశన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విఖార్ అహ్మద్ భార్య బ్యాంక్ నుంచి రుణం తీసుకొని తన అక్క భర్తకు రూ.40వేలు అప్పుగా ఇచ్చింది. ఈ విషయం విఖార్ అహ్మద్‌కు తెలియడంతో ఆమెను ప్రశ్నించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమె అన్నదమ్ముళ్లు ముగ్గురు వడ్డెర కాలనీలో విఖార్ అహ్మద్‌పై దాడికి దిగారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి


పట్టుబడిన పందెం రాయుళ్లు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధిలోని గంగాయిపేట్ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఆర్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పది మందిని గుర్తించి కేసు నమోదు చేయడంతో పాటు రెండు కొడిపుంజులు, రూ. 2710 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబీకుల చెంతకు వృద్ధుడు


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

సిరికొండ: మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు మతిస్థిమితం కోల్పోయి సిరికొండకు చేరాడు. వివరాలలోకి వెళితే.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం రామచంద్రపురం గ్రామనికి చెందిన చెల్ల రాజయ్య(72) గురువారం ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లానని బయటకు వచ్చాడు. మతిస్థిమితం కోల్పోయి మండలంలోని సిరికొండకు ఆదివారం ఉదయం చేరుకున్నాడు. గ్రామంలో తిరుగుతూ కనిపించడంతో స్థానికులు గమనించిన సర్పంచ్ సర్పంచ్ ఓరగంటి నర్మదకు సమాచారం అందించారు. దీంతో సర్పంచ్ వివరాలు సేకరించి పోలీసులకు అప్పగించింది. పోలీసులు ఆరా తీయగా చివరికి గ్రామం వివరాలు తెలిపాడు. ఆ వివరాలతో రామడుగు మండల పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో రామడుగు పోలీసులు రాజయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సిరికొండ చేరుకున్న రాజయ్య కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో రాజయ్య కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దీవించమ్మా..


నెత్తిన బోనం ఎత్తుకొని మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తురాలు


మహాలక్ష్మి ఆలయంలో కొలువైన అమ్మవారు


బోనం ఎత్తుకొని మహాలక్ష్మి అమ్మవారి టెంపుల్‌కు బయలుదేరిన మహిళలు

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆషాఢం చివరి ఆదివారం కావడంతో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ పొలిమేరల్లో కొలువుదీరిన గ్రామదేవతలకు బోనాలు సమర్పించి సల్లంగా చూడు తల్లీ అని మొక్కుకున్నారు. ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


కొడుకుతో గంట కొట్టిస్తూ..


అమ్మవారి సన్నిధిలో..


ఇత్తడి తొడుగు అందిస్తున్న భక్తులు


బోనాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు


వనభోజనాల్లో భక్తులు


వలతో బోనం ఎత్తుకొని వస్తున్న భక్తులు


మేకపోతుతో మొక్కులు చెల్లించుకుంటూ..

ఇప్పుడైనా సరిచేస్తారా..!


ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు కలిగేటి వనిత, ధన్నూర్ బి గ్రామం. ఆమెకు రెండు ఓటరు కార్డులు వచ్చాయి. ఈమెకు ధన్నూర్ బి గ్రామంలో 241,242 బూతుల్లో ఓటరుగా నమోదు చేశారు. దీంతో తనకు రెండు ఓటరు కార్డులు రావడంతో ఎక్కడ ఓటు వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

- గతంలో ఓటరు నమోదులో అనేక తప్పులు
- ఒకే వ్యక్తికి రెండు ఓటరు కార్డులు
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణే కీలకం
- కొత్తగా నమోదు, మార్పులు, చేర్పుల్లో పరిశీలన ముఖ్యం



అదిలాబాద్ నియోజకవర్గంలో..	
పోలింగ్ స్టేషన్లు	281
బూత్ లెవల్ అధికారులు	281
ఓటర్లు	225062
బోథ్ నియోజకవర్గంలో..	
పోలింగ్ స్టేషన్లు	301
బూత్ లెవల్ అధికారులు	301
ఓటర్లు	201034

బోథ్: రాష్ట్ర ఎన్నికల సంఘం 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలనిచ్చింది. దీంతో అధికారులు హడావిడిగా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. గ్రామాల్లో బీఎల్‌వోలు 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయడానికి ఫారాలు నింపారు. అలాగే మార్పులు, చేర్పులకు సంబంధించిన వాటని స్వీకరిస్తున్నారు. అయితే గతంలో చాలా మంది పేర్లు ఓటరు లిస్టులో గల్లంతయ్యాయి. మరిందరి ఓటరు కార్డుపై వారి ఫొటోకు బదులు ఇతరుల ఫొటోలు వేశారు. మరికొందరివి రెండు ఓటరు కార్డులు వచ్చాయి. హడావుడి చేస్తే ఆన్‌లైన్‌లో ఫారాన్ని ఎంట్రీ చేయడం తప్పులతడకగా మారే అవకాశం ఉంది.

ప్రస్తుతం హడావుడి చేస్తూ...

ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడానికి అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు ప్రతి బూత్ లెవల్‌లో కొత్త ఓటరు నమోదు ప్రక్రియతో పాటు, మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంది. ప్రతీ ఇంటిలో ఎంతమంది ఉన్నారో వాటి వివరాలను తెలుసుకోవాలి. అయితే చాలా మంది బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పనిచేయకపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక కళాశాలల్లో 18 సంవత్సరాలు నిండిన వారి వివరాలను తెప్పించుకుంటున్నారు. వీటిల్లో ఎంతమంది కళాశాలలు నిజమైన వివరాలు ఇస్తున్నారో తెలియడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా తప్పులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

చేయాల్సింది ఇలా..

పోలింగ్ కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఓటరు నమోదుతోపాటు తొలగింపులో బీఎల్‌ఓలు ప్రముఖ పాత్ర పోషించాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ముసాయిదా ఓటరు జాబితా సవరణ సమయంలో బూత్ లెవల్ అధికారి ఇంటింటికీ తిరుగుతూ ఓటరు నమోదుపై చైతన్యం కల్పించాలి. జాబితా నుంచి ఎవరి పేరునైనా తొలగించాలంటే నోటీసు ఇచ్చి విచారణ జరపాలి. నిర్ధారణ చేసుకున్న తరువాతనే పేరు తొలగించాల్సి ఉంటుంది. సాధారణంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటరు నమోదు కోసం ప్రత్యేకంగా డ్రైవ్ చేపడతారు. ఆ సమయంలో బీఎల్ఎలు స్థానికంగా అందుబాటులో ఉండి అర్హులైన వారి పేర్లు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి.

చేస్తున్నారు ఇలా..

బీఎల్ఎలు స్థానికంగా ఉండకపోవడంతో స్థానిక రాజకీయ నాయకుల మాటలు వినేవారు చెప్పినట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోనే ఓట్ల తొలగింపు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఓటరు జాబితాలో ఒక్కసారి పేరు నమోదైతే తొలగించాలంటే తప్పని సరిగా ఆ ఓటరు సమీప ఇంటి యజమానుల నుంచి వివరణ తీసుకోవాలి. తర్వాత తొలగించాలని నిబంధనలు చెబుతున్నాయి. ఒక ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేటప్పుడు అనేక తప్పులు దొర్లుతున్నాయి. మరోవైపు ఒక వ్యక్తికి రెండేసి ఓటరు కార్డులు రావడం అధికారుల పనితీరు ఎలా ఉందో చెప్పవచ్చు.

సాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ప్రకారం వచ్చే అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. అర్హత కలిగిన దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. జూన్ 24 నుంచి పోలింగ్ కేంద్రాలు, లొకేషన్ మార్పులు సవరణలు, పోలింగ్ కేంద్రాల పరిధి, హద్దులు ప్రతిపాదనలు ఖరారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 23 వరకు జరుగనుంది. జూలై 25 నుంచి 31 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేస్తారు. ఆగస్టు 2వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఆగస్టు 2 నుంచి 31వ తేదీ వరకు ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 22 వరకు దరఖాస్తులను పరిష్కరిస్తారు. అక్టోబర్ 4న తుది జాబితాను ప్రకటిస్తారు. ఇదే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ జాబితాలో పేరు నమోదైనవారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

బుద్ధభూమి సాధన తాత్కాలిక కమిటీ ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గం శేఖర్

ఆదిలాబాద్‌రూరల్: అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబాసాహెబ్ కాంబ్లే, భారతీయ బుద్ధ మహాసభ అధ్యక్షుడు సలీక్ రావు నాగరాడేల ఆధ్వర్యంలో బుద్ధ భూమి సాధన తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సామ్రాట్ అశోక బుద్ధ విహార్‌లో ఆయా సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. బుద్ధ భూమి సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, అధ్యక్షుడిగా బాబాసాహెబ్ కాంబ్లే, ఉపాధ్యక్షుడిగా దేవానంద్ పాటిల్, రాందాస్ పాటిల్, ప్రధాన కార్యదర్శి గంగారాం బోరెకర్, కోశాధికారిగా కాంబ్లే విఠల్, అశోక్ శిప్లే, మహిళా అధ్యక్షురాలుగా శోభ బాయి తులజాపురే, సలహాదారులుగా షాలీక్ రావ్ నాగరాడే, పాటిల్ బాపూరావు, సుదర్శన్ బౌరేలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్ మాట్లాడుతూ సీతాగొంది, కమలాపూర్ శివారులో జై భీం ట్రస్ట్‌కు కేటాయించిన భూమిని దళిత సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల కోసం వినియోగిస్తామని అన్నారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పేకాటడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3910 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల కేంద్రానికి లోడెల్లి లలిత (53) ఆదివారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లలిత తెల్లవారు జామున నిద్రలేచిన అనంతరం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లగా పాముకాటుకు గురైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తలమడుగు: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవాపూర్, కుచులపూర్ గ్రామాల్లో బీజేపీ మహాజన్ సంపర్క్‌లో భాగంగా టిఫిన్ బాక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా గ్రామాల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. అధికార పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. సమయం తక్కువగా ఉందని, ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, లోక ప్రవీణ్‌రెడ్డి, రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, బాబారవ్ పటేల్, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే, తలమడుగు మండల అధ్యక్షులు బోనగిరి స్వామి, ఇచ్చోడ మండల అధ్యక్షుడు కేంద్ర నారాయణ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్ గ్రామానికి చెందిన దేవి మహేందర్ అలియాస్ మూర్తి (38) ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం... పడ్తనపల్లి గ్రామానికి చెందిన మూర్తి కూలీ పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఆదివారం భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మూర్తి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో పీఈటీ మృతి

రెబ్బెన: మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన చునార్కర్ ప్రహ్లాద్ (26) పీఈటీ శనివారం రాత్రి బుద్దనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై భూమేష్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కిష్టాపూర్‌లో నివాసం ఉంటే ప్రహ్లాద్ కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలల్లో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్ వస్తున్న క్రమంలో బుద్దనగర్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టి కిందపడి మృతిచెందాడు.

సాగుబాటలో...


ఎడ్లబండిపై పొలం పనులకు వెళ్తున్న మహిళలు


దిలావర్‌పూర్ మండలంలోని గ్రామాలకు చెందిన వరి పొలాల్లో నాట్లు వేస్తున్న మహిళలు


రాంపూర్ సమీపంలోని పొలాల్లో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లోని రైతులు పొలం పనుల్లో బిజీగా మారారు. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని గ్రామాల్లో వరినాట్లు వేయడం ప్రారంభమైంది. దీంతో రైతులు ట్రాక్టర్‌తో దున్నుతూ, ఎరువులు చల్లుతూ, వరినారు తీస్తూ, నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల్లో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్న దృశ్యాలు సాక్షి క్లిక్ మనిపించింది.
– సాక్షి, ఫొటోగ్రాఫర్, నిర్మల్


నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల సమీపంలో


దిలావర్‌పూర్ మండల సమీపంలోని పంట పొలాల్లో కలుపు తీస్తున్న కూలీలు


సోయా పంటకు పిచికారీ చేస్తున్న రైతు

గాయపడిన యువకుడి మృతి

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్–పెంచికల్‌పేట ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నితిన్ (22) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన నితిన్ ఆమె తల్లి విమల, బంధువు శేఖర్‌లు మోటారు సైకిల్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను రాస్పెల్లి వద్ద ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తల్లి జుమిడి విమల, కుమారుడు నితిన్‌లు తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి నితిన్ ఆదివారం మృతి చెందారు. దీంతో సీతానగర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.